## 15 నుంచి ఎస్‌ఏ-2 పరీక్షలు

**రీ షెడ్యూల్ చేసిన విద్యాశాఖ**

బొంరాస్‌పేట, ఏప్రిల్ 4 : ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 1 నుం చి 9వ తరగతి వరకు నిర్వహించే సమ్మేటివ్ అసెస్‌మెంట్-2 పరీక్షలను విద్యాశాఖ అధికారులు రీషెడ్యూల్ చేశారు. ఈ నెల 15 నుంచి 22వర కు పరీక్షలను నిర్వహించాలని డీఈవో ఉత్తర్వులు జారీ చేశారు. అంతకు ముందు వీటిని ఈ నెల 8 నుంచి 20వరకు నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేశారు. తాజాగా పరీక్షల టైం టైబుల్‌ను మారుస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. మారిన షెడ్యూల్ ప్రకారం 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు 15న ఫస్ట్ లాంగ్వేజ్, 16న ఇంగ్లిష్, 18న గణితం, 19న ఈవీఎస్ పరీక్షలు నిర్వహిస్తారు. 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు 15న ఫస్ట్ లాంగ్వేజ్, 16న సెకండ్ లాంగ్వేజ్, 18న ఇంగ్లిష్, 19న 6, 7 తరగతుల వారికి సాంఘికశాస్త్రం, 8, 9 తరగతుల వారికి గణితం, 20న 6, 7 తరగతుల వారికి సామాన్య శాస్త్రం, 8, 9వ తరగతుల వారికి ఉదయం భౌతిక శాస్త్రం, మధ్యాహ్నం జీవశాస్త్రం, 22న 6, 7 తరగతుల వారికి గణితం, 8, 9 తరగతుల వారికి సాంఘిక శాస్త్రం పరీక్షలు నిర్వహిస్తారు. 23న పరీక్షా ఫలితాలను ప్రకటించి విద్యార్థులకు ప్రగతి నివేదికలను అందజేస్తారు. జిల్లాలోని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలలు వీటిని పాటించాలని డీఈవో రేణుకాదేవి ఆదేశాలు జారీ చేశారు.

## ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి 7న పరీక్ష



**వికారాబాద్ డీఈవో రేణుకాదేవి**

ధారూరు, ఏప్రిల్ 4 : ఆదర్శ పాఠశాలలో ప్రవే శం కోసం ఈ నెల 7న పరీక్ష నిర్వహించనున్నట్లు వికారాబాద్ డీఈవో రేణుకాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి జిల్లాలోని ఆదర్శ పాఠశాలల్లో 6వ తరగతిలో ప్రవేశం కోసం ఈ నెల 7న ఆదివారం ఉదయం 10 నుం చి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే 7, 8, 9, 10వ తరగతుల్లో ప్రవేశం కోసం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని సంబంధిత మండల కేం ద్రాల్లోని ఆదర్శ పాఠశాలల్లో పరీక్షలు జరుగుతాయని తెలిపారు. పరీక్ష రాసే విద్యార్థులు వారికి కేటాయించిన పరీక్ష కేంద్రానికి గంట ముందుగానే చేరుకోవాలన్నారు. విద్యార్థులతో పాటు ఇన్విజిలేటర్లు, ఇతర సిబ్బంది కూడా సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకు రాకూడదని సూచించారు.

## బిట్స్ ఫిలానీతో సీఆర్‌పీఎఫ్ ఎంఓయూ

జవహర్‌నగర్, ఏప్రిల్ 4: అత్యాధునిక ప్రమాణాలతో కూడిన నైపుణ్య శిక్షణను అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని బిట్స్ ఫిలానీ డైరెక్టర్ సౌమ్యో ముఖర్జీ అన్నారు. జూబ్లీహిల్స్‌లోని ఐజీ సదరన్ సెక్టార్‌లో గురువారం దివ్యాంగ వారియర్స్‌కు నైపుణ్య శిక్షణ అందించేందుకు బిట్స్ ఫిలానీ, సీఆర్‌పీఎఫ్ మధ్య ఎంఓయూ కుదుర్చుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఆర్‌పీఎఫ్ ఐజీ చారు సిన్హా ఐపీఎస్, బిట్స్ ఫిలానీ డైరెక్టర్ సౌమ్యో ముఖర్జీ హాజరై ఒప్పంద పత్రంపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా బిట్స్ ఫిలానీ డైరెక్టర్ సౌమ్యో ముఖర్జీ మాట్లాడుతూ బిట్స్ ఫిలానీ ఉత్తమ నైపుణ్య శిక్షణకు నాందిగా నిలుస్తుందని, దివ్యాంగ్ వారియర్స్‌కు విలువలతో కూడిన శిక్షణను అందజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ డీఐజీ అనిల్ మింజ్, బిట్స్ ఫిలానీ డీన్ యోగేశ్వరీ, సీఆర్‌పీఎఫ్, బిట్స్ ఫిలానీ సిబ్బంది పాల్గొన్నారు.



# జంక్షన్లు జామ్!

## అభివృద్ధి పనులు పట్టని బల్దియా.. 8 జంక్షన్లలో తీవ్రమైన ట్రాఫిక్ సమస్య

సిటీబ్యూరో, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ రద్దీ నివారణలో భాగంగా జీహెచ్‌ఎంసీ చేపడుతున్న పలు చోట్ల జంక్షన్ల అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. గడిచిన ఐదు నెలలుగా మూడు అడుగులు ముందుకు-ఆరు అడుగులు వెనక్కి అన్న చందంగా పనులు జరుగుతున్నాయి. జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారుల నిర్లక్ష్యం..బిల్లుల చెల్లింపులు లేక కాంట్రాక్టర్లు పనులను చేపట్టలేక మధ్యలోనే చేతులెత్తేస్తున్న పరిస్థితి. ఈ నేపథ్యంలోనే 8 ప్రాంతాల్లోని కూడళ్లలో ట్రాఫిక్ జామ్‌లు అవుతున్నాయి. ఉదయం, సాయంత్రం సమయాల్లో పరిస్థితి మరింత ఘోరంగా ఉంటున్నది. నిత్యం ట్రాఫిక్ స్తంభిస్తుండటంతో ఎండాకాలం నడిరోడ్డుపై జనం నరకం చూస్తున్నారు. దీనికి తోడు వీఐపీలు వచ్చి వెళ్లే సమయాల్లో మాత్రమే కనిపించే ట్రాఫిక్ సీఐలు, ఎస్‌ఐలు..వాహనాల రద్దీ ఎక్కువగా ఉండే సమయంలో ఉండటం లేదు. జీహెచ్‌ఎంసీ కమిషనర్ చొరవ తీసుకుని జంక్షన్ల అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయించడంతో పాటు ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

### నత్తనడకన జరుగుతున్న జంక్షన్ల అభివృద్ధి పనుల వివరాలు

| జంక్షన్ | ఖర్చు చేస్తున్నది (రూ.లక్షల్లో) | పనుల పురోగతి(శాతంలో) |
|---|---|---|
| హబ్సిగూడ | 202 | 70 |
| కొత్తపేట | 305.50 | 85 |
| ఆరాంఘర్ చౌరస్తా | 263.50 | ప్రారంభ దశలో.. |
| ఐఎస్ సదన్ | 320 | ప్రతిపాదన దశ దాటలేదు |
| పంజాగుట్ట | 198 | 40 |
| ఎన్‌ఎఫ్‌సీఎల్ | 200 | ప్రారంభ దశలో.. |
| నారాయణగూడ | 199 | 75 |
| సంగీత్ | 198.8 | 90 |



మాట్లాడుతున్న నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

## నన్ను గెలిపిస్తే ప్రశ్నించే గొంతుకనవుతా

**నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్**

ఆమనగల్లు, ఏప్రిల్ 4 : నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎంపీగా అవకాశం కల్పిస్తే నాగర్‌కర్నూల్ వాణి ఢిల్లీలో వినిపిస్తానని, పేద ప్రజల అభ్యున్నతి కోసం అంకితభావంతో పని చేసి చూపిస్తానని నాగర్‌కర్నూల్ బీఆర్‌ఎస్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆమనగల్లు మండల కేంద్రంలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడారు. ఇంతకుముందు ఇక్కడి నుంచి ఎన్నికైన ఎంపీలంతా పార్లమెంట్‌లో మౌనంగా ఉన్నారన్నారు. ఇలాంటి వ్యక్తులతో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని ప్రజలందరికీ నష్టం జరిగిందన్నారు. కేసీఆర్ నాయకత్వంలో పని చేయడం గర్వంగా ఉందన్నారు. తెలంగాణ అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని, వెయ్యి గురుకులాలను ఇచ్చిన ఘనత కేసీఆర్‌కు దక్కిందన్నారు. గురుకులాల ద్వారా లక్షలాది మంది పేద విద్యార్థులు ప్రపంచ స్థాయిలో చదువుకుని ఉద్యోగాలు చేస్తున్నారని గుర్తు చేశారు. కాంగ్రెస్, బీజేపీల మాయ మాటలను నమ్మి మోసపోవద్దని ఆయన సూచించారు. బీఆర్‌ఎస్ శ్రేణులంతా కలిసికట్టుగా పనిచేసి పార్టీ గెలుపునకు కృషి చేయాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్‌యాదవ్, బండగల్ల చందు, జంతుక అల్లాజీ, శంకర్, రమేశ్‌నాయక్, రమేశ్ తదితరులున్నారు.



## గరం గరంగా నగరం..

సిటీబ్యూరో, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ): మండుతున్న ఎండలతో గ్రేటర్ మండిపోతున్నది. దక్షిణ దిశ నుంచి వీస్తున్న కిందిస్థాయి గాలుల ప్రభావంతో నగరంలో ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయిని మించి నమోదవుతున్నాయి. ఫలితంగా ఉదయం 8గంటల నుంచే ఎండలు మొదలై మధ్యాహ్నం సమయానికి అగ్నిగుండాన్ని తలపిస్తున్నాయి. నగరంలో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటి నమోదవుతుండటంతో జనం బయటకి వచ్చేందుకు జంకుతున్నారు. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయికంటే కంటే 5.3 డిగ్రీలు పెరిగి 40.3డిగ్రీల సెల్సియస్‌గాను, కనిష్ఠం 26.4 డిగ్రీ సెల్సియస్, గాలిలో తేమ 21శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. కాగా, ఈ వేసవి కాలంలో పగటి ఉష్ణోగ్రతలు 40డిగ్రీలు దాటడం ఇది రెండోసారి. గత నెల 29న పగటి ఉష్ణోగ్రతలు 40.2 డిగ్రీలు నమోదవ్వగా, ఏప్రిల్ 4న మరోసారి 40.3లకు చేరాయి. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలకు చేరుకునే అవకాశమున్నట్లు అధికారులు తెలిపారు.

# పైన గంగా.. కింద బెంగ కారణం జలగలేనా.?

నెత్తిన జంట జలాశయాలున్నా.. 'బోరు'మనాల్సిందేనా.?
పాతాల గంగ పైకిరాదాయే.. ప్రభుత్వం పట్టించుకోదాయే..!
అడుగడుగునా బోర్లు.. అంతరించిన భూగర్భ జలాలు
బరితెగించిన అక్రమనీటి వ్యాపారం
కంటితుడుపు చర్యలకే రెవెన్యూ యంత్రాంగం
నీటికోసం అల్లాడాల్సిన దుస్థితి
ఎడారిని తలపిస్తున్న.. ఆకుపచ్చని గ్రామాలు
కరువు ఛాయలు దాపురిస్తున్నాయంటున్న ఖానాపూర్, వట్టినాగులపల్లి గ్రామస్తులు

"పక్కన కృష్ణమ్మ ఉన్నా.. ఫలితమేమి లేకపాయే.." అంటూ.. ఓ కవి పాడినట్లు నెత్తిన జంట నగరాలకు తాగునీటిని అందించే ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌లు ఉన్నప్పటికీ చెంతనే ఉన్న గ్రామాలు తాగు, సాగు నీటి కోసం అల్లాడాలిపోవాల్సిన పరిస్థితి దాపురించింది. తిలా పాపం.. తలా పిడికెడు అన్నట్లు.. కొందరు అక్రమ వ్యాపారులు వంద అడుగులకో బోరు బావి.. వెయ్యి అడుగుల లోతు వరకు తవ్వి.. జలగల్లా నీటిని తోడేస్తూ.. వేల సంఖ్యలో ట్యాంకర్ల ద్వారా నీటిని విక్రయిస్తుండటంతో ఆయా గ్రామాల్లో కరువు ఛాయలు అలుముకున్నాయి. నిన్నటివరకు పచ్చని పంట పొలాలతో ఆహ్లాదాన్ని పంచిన ఆ గ్రామాలు నేడు ఎడారిని తలపిస్తున్నాయి. ఇది ఎక్కడో అనుకుంటున్నారా..? ఐటీ హంగులతో దినదినం అభివృద్ధి చెందుతున్న ఖానాపూర్, వట్టినాగులపల్లి గ్రామాల పరిస్థితి ఇది. ఈ దుస్థితికి అధికారుల నిర్లక్ష్యం, అవినీతి కారణమంటూ ప్రజలు దుమ్మెత్తి పోస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి.. అక్రమాలపై చర్యలు తీసుకుంటారో చూద్దాం..! *- మణికొండ, ఏప్రిల్ 4*

సారూ.. మా ఊరి పాతాల గంగ.. పాతాలానికి పడిపోతుంది.. అడ్డుకట్ట వేయండంటూ.. ఆ గ్రామస్తులు రెవెన్యూ అధికారులను రెండు మాసాలుగా వేడుకుంటున్నారు. కానీ వారేమో మాకు క్షణం తీరిక లేదన్నట్లుగా ప్రజల సమస్యలను గాలికొదిలేసి.. కలెక్టర్ కార్యాలయంలో పనులున్నాయంటూ తప్పించుకు తిరుగుతున్నారు. దీంతో ఆకుపచ్చని గ్రామాలు ఇప్పుడు ఎడారిని తలపిస్తున్నాయంటే కారణం ఎవరు? ప్రజల గోసను పట్టించుకోకుండా అంతకన్న మిక్కిలి పనులేమైన ఉన్నాయా.? ఈ రెవెన్యూ అధికారులకు అంటూ ఆ గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

### ఈ కరువుకు బాధ్యులెవరు?

ఖానాపూర్, వట్టినాగులపల్లిలో గత నెలరోజులుగా తాగునీటి సమస్యలు తీవ్రతరంగా మారాయి. అక్రమ నీటి వ్యాపారాలతో గ్రామాల్లో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటి పోయాయి. అయినా నీటి వ్యాపారాలపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో రెవెన్యూ అధికారులపై రెండు గ్రామాల ప్రజలు అనేక అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. ఆకుపచ్చని గ్రామాల్లో చోటుచేసుకున్న కరువుకు బాధ్యులెవరు.? రెవెన్యూ అధికారుల అక్రమవసూళ్లా.. లేక నిర్లక్ష్యపు ధోరణియా.? అని ప్రశ్నిస్తున్నారు. అంటున్నారు. ఎప్పుడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలోనే పనులున్నాయంటూ వెళ్లే అధికారులకు అక్కడేం పని.. అక్కడే విధులు నిర్వహించుకోవచ్చు కదా.. అంటూ ప్రజలు మండిపడుతున్నారు. స్థానిక సమస్యలపై స్పందించని అధికారులు మాకెందుకని మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమనీటి వ్యాపారాలపై చర్యలు తీసుకోవాలని రెండు గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

### పూర్తి వివరాలల్లోకి వెళితే..

నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్, వట్టినాగులపల్లి గ్రామాలు ఒకప్పుడు ఆకుపచ్చని గోదావరి గ్రామాలుగా విరాజిల్లేవి. క్రమేణ భూముల ధరలు పెరగడంతో ఇక్కడ వ్యవసాయాన్ని తగ్గించిన అన్నదాతలు భూములను ప్రైవేటు వ్యక్తులకు వివిధ రకాల వ్యాపార కేంద్రాలకు లీజులకు అప్పగించారు. దీంతో చాలా భూముల్లో మార్బుల్స్ దుకాణాలు, ఆట ప్రాంగణాలుగా మారాయి. ఇదిలావుండగా మిగిలిన కొంతమంది వ్యవసాయాన్ని మానేసి అక్రమనీటి వ్యాపారులకు తమ భూములను లీజులకు అప్పగించడంతో గత ఏడాదికాలంగా ఈ ప్రాంతంలో నీటి వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. ప్రతి రోజూ ఖానాపూర్, వట్టినాగులపల్లి గ్రామాల పరిధి నుంచి సుమారు రెండుకోట్ల లీటర్ల నీటిని ట్యాంకర్ల ద్వారా తోడేస్తున్నారు. ఫలితంగా ఆకుపచ్చని గ్రామాలు ఇప్పుడు ఏడారిని తలపించేలా మారాయి. ప్రతి వంద అడుగుల దూరంలో ఒక్కబోరుబావిని తవ్వి అక్కడి నుంచి రాత్రింబవళ్లు నీటిని తోడేసి సొమ్ము చేసుకుంటున్నారు. తమ గ్రామాల్లో భూగర్భజలాలు అడుగంటి పోతున్నాయంటూ స్థానిక ప్రజలు అనేక పర్యాయాలు రెవెన్యూ అధికారులకు విన్నవించినా ఫలితం శూన్యంగానే మారింది.

### వెయ్యి అడుగుల లోతుకు భూగర్భ జలాలు

సాగు నీటి సమస్యలు దేవుడెరుగు. కనీసం తాగునీటి కోసం భూగర్భ జలాలను కాపాడాలంటూ విన్నవిస్తే చుట్టుపుచూపుగా రెవెన్యూ సిబ్బంది వచ్చి కంటి తడుపు చర్యలు తీసుకోవడంతో నీటి వ్యాపారస్తులు బరితెగించి నీటిని యథేచ్ఛగా తోడేస్తున్నారు. క్రమేణ ప్రస్తుతం ఖానాపూర్, వట్టినాగులపల్లి గ్రామాల్లో వెయ్యి అడుగుల లోతుకు నీటి నిల్వలు చేరుకోవడం గమనార్హం. సకాలంలో రెవెన్యూ అధికారులు స్పందించి అక్రమ నీటి వ్యాపారాలను అరికట్టి ఉంటే మా ఊర్లు ఇలా కరువును తలపించేవిగా మారేవి కావంటూ ఆ గ్రామాల ప్రజలు వాపోతున్నారు.




### ధ్వంసమవుతున్న మున్సిపల్ రోడ్లు, పైపులైన్లు

అక్రమ నీటి వ్యాపారం ద్వారా మున్సిపాలిటీ నిధులతో నిర్మించిన సీసీ, బీటీ రోడ్లన్నీ శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రజల నిధులతో నిర్మించిన ఈ రోడ్ల పరిరక్షణ బాధ్యత మున్సిపల్ శాఖ అధికారులకు ఉన్నప్పటికీ నీటి వ్యాపారాల నియంత్రణ విషయంలో తమకెలాంటి అధికారాలు లేవంటూ ఆ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ప్రజల సొమ్ముతో నిర్మించిన రహదారులు పాడై పోతుంటే పట్టించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### వ్యవసాయ బావులకు కనెక్షన్లు.. నీటి దందా

వ్యవసాయం చేసుకునేందుకు ఏజీఎల్ కనెక్షన్ ద్వారా విద్యుత్‌ను అందించాల్సి ఉంటుంది. కానీ ఇవే కనెక్షన్లను పెట్టి యథేచ్ఛగా నీటి వ్యాపారం జరుగుతున్నది. అయినా ఆ శాఖ అధికారులకు పట్టింపే లేదు. విద్యుత్ మీటర్ల మంజూరులో కమర్షియల్‌గా కేటాయింపులు చేపట్టాలి కానీ ఏనాడు ఆశాఖ అధికారులు పర్యటించి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ఫలితంగా ప్రజల సొమ్ముతో ఏర్పాటు చేసిన రహదారులు, అక్రమ విద్యుత్ వినియోగంతో పాటు ప్రకృతి అందించే భూగర్భ జలాలను విచ్ఛిన్నం చేస్తున్న అక్రమ నీటి వ్యాపారస్తులపై ఇప్పటి వరకు ఏ శాఖ అధికారులు చర్యలకు ఉపక్రమించలేదంటే వ్యాపారాలు ఏస్థాయిలో కొనసాగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు.



సమావేశంలో మాట్లాడుతున్న వికారాబాద్ అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ

## తాగునీటి సమస్య తలెత్తొద్దు

■ **వికారాబాద్ అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ**

ధారూరు, ఏప్రిల్ 4 : గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి సమస్యలు పరిష్కరించాలని వికారాబాద్ అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో జిల్లాలో తాగునీటి సరఫరాకు సంబంధించి మిషన్ భగీరథ, పంచాయతీ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాహుల్‌శర్మ మాట్లాడుతూ వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అన్ని జాగ్రతలు తీసుకోవాలన్నారు. ప్రజలకు ఇబ్బంది కలుగకుండా బోర్‌వెల్స్, చేతిపంపులను వెంటనే మరమ్మతులు చేపట్టాలని సూచించారు. ఎక్కడైనా మిషన్ భగీరథ పైపులైన్లు పగిలిపోతే లీకేజీలతోపాటు రిపేర్లు చేయించాలన్నారు. అలాగే డివిజన్, మండల స్థాయిలో గ్రామాలవారీగా బోర్‌వెల్స్, చేతిపంపులు ఎన్ని ఉన్నాయి.. అన్ని వినియోగంలో ఉన్నాయా.. ఇంకా ఏమైనా మరమ్మతులు చేపట్టాలా అని ఆయన ఆరా తీశారు. మి షన్ భగీరథ నీరు అనివార్య కారణాలతో నిలిచిపోతే ప్రత్యామ్నాయంగా తాగునీటిని అందించేందుకు ముందస్తు కార్యాచరణతో సిద్ధంగా ఉండాలని ఆయన సూచించారు. అవసరమైతే గ్రామాల్లో వ్యవసాయ బోర్లను అద్దెకు తీసుకుని నీటిని సరఫరా చేయాలన్నారు. సమావేశంలో జిల్లా పంచాయతీ శాఖ అధికారిణి జయసుధ, మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బాబు శ్రీనివాస్, డివిజనల్ పంచాయతీ అధికారులు సంధ్యారాణి, శంకర్‌నాయక్, మి షన్ భగీరథ డీఈలు సుబ్రహ్మణ్యం, రత్నప్ర సాద్, శశాంక్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

## బొటానికల్ గార్డెన్‌లో వేసవి శిబిరం

శేరిలింగంపల్లి, ఏప్రిల్ 4 : కొత్తగూడలోని బొటానికల్ గార్డెన్‌లో ఈ నెల 6 నుంచి ప్రత్యేక వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు టీఎస్‌ఎఫ్‌డీసీ (తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ) ఎకో టూరిజం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంజిత్ నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్, మే నెలల్లో ప్రతి శనివారం ఈ క్యాంపు ఉంటుందన్నారు. ఏప్రిల్ 6, 13, 20, 27, మే 4, 11, 18, 25, 31 తేదీల్లో ఈ శిక్షణ శిబిరం ఉంటుందని తెలిపారు. ఇందులో అన్ని వయస్సుల వారు పాల్గొనవచ్చని, ఎవరికైనా రూ.1200 ప్రవేశ రుసుము ఉంటుందని తెలిపారు. ఇందులో ఔత్సాహికులు ఎవరైనా పాల్గొనవచ్చని అన్నారు. శిబిరంలో భాగంగా బొటానికల్ గార్డెన్‌లో ఉన్న మొక్కలు, చెట్ల గురించి వివరంగా తెలుసుకోవచ్చని, అలాగే స్నాక్స్, భోజన వసతి కూడా కల్పించనున్నట్లు వివరించారు. జిప్‌లైన్, స్కై సైక్లింగ్, ఆర్చరీ, హై రోప్ వంటి కార్యక్రమాల్లోనూ పాల్గొనవచ్చని, అలాగే గోల్ఫ్ కార్ట్ వాహనాలలో సంచరిస్తూ 50 థీమ్ పార్కులను చూడవచ్చని అన్నారు. దీంతోపాటు పర్యావరణ పరిరక్షణ, అడవుల గురించి అవగాహన కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ శిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలల నుంచి వచ్చే విద్యార్థులకు ప్రత్యేక సదుపాయాలను కల్పించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9493549399, 9346364583 నంబర్లలో సంప్రదించాలన్నారు.